ప్రజలందరూ సర్వేకు సహకరించాలి



అడ్డగుట్ట: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే బుధవారం అడ్డగుట్టలో జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ ఏఈ తివారీ సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అతికించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలందరూ సహకరించాలని సూచించారు. డివిజన్‌లో ఒక్కో సూపర్‌వైజర్‌కు పది మంది సిబ్బంది చొప్పున మొత్తం 111 మంది సిబ్బందితో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సర్వే 18 రోజులపాటు ఉంటుందని, 6, 7వ తేదీల్లో ఇంటింటికీ తిరిగి స్టిక్కర్లు అంటిస్తామని చెప్పారు. అనంతరం, 8వ తేదీ మళ్లీ వచ్చి పూర్తి వివరాలు తీసుకుంటామని వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సతీష్, ఉమా, భాగ్య, సురేష్, యూసుఫ్, కిషన్‌సింగ్, కాంగ్రెస్ నేతలు గంటరాజు, రామలీల తదితరులు పాల్గొన్నారు.

డిజిటలైజేషన్‌ను ప్రోత్సహించాలి



సనత్‌నగర్: విద్యార్థులకు పేపర్ వాడకం తగ్గించి డిజిటలైజేషన్‌ను ప్రోత్సహించాలని ప్రాజెక్ట్ ఆఫీసర్ నాగేశ్వరరావు సూచించారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో బుధవారం సనత్‌నగర్ హిందూ మహిళా కళాశాలలో ప్రపంచ పేపర్ ఫ్రీ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా పేపర్ ఉత్పత్తుల కోసం అటవీ సంపద తరిగిపోతుందన్నారు. ప్రపంచ అటవీ నిర్మూలనలో దాదాపు 35 శాతం కాగితం ఉత్పత్తులకే ఉపయోగిస్తుండడం బాధాకరమన్నారు. ఈ నేపథ్యంలో రికార్డులను డిజిటలైజేషన్ చేయడం, ఇ-సంతకాలు, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్, లావాదేవీలను ప్రోత్సహించడం, పునర్వినియోగ ఉత్పత్తులను ఉపయోగించడాన్ని విద్యార్థులు ప్రోత్సహించాలన్నారు. అటవీ సంపదను కాపాడుకోవాలంటే పేపర్ ఉత్పత్తుల వాడకాన్ని తగ్గించాలని హితవు పలికారు. వరల్డ్ పేపర్ ఫ్రీ డే సందర్భంగా విద్యార్థినులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్‌నేరాలపై వృద్ధులు అప్రమత్తంగా ఉండాలి

డీఎస్పీ అనుముల శ్రీనివాస్



సికింద్రాబాద్: సైబర్ నేరాలపై వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్స్ డీఎస్పీ అనుముల శ్రీనివాస్ సూచించారు. సీనియర్ సిటిజన్స్ దివస్ సందర్భంగా బుధవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో జాగరూక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాల బారిన పడకుండా ఉండేందుకు వృద్ధులకు జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ బి.సాయీశ్వర్‌తో కలిసి సైబర్ క్రైమ్ పోలీసులు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులతో వచ్చే ఫోన్‌కాల్స్ పట్ల వృద్ధులు అప్రమత్తంగా ఉండాలన్నారు. స్నేహితులమని నమ్మిస్తూ ఫోన్‌కాల్స్ చేయడం, ఆన్‌లైన్ సందేశాలను అంగీకరించమంటూ కోరడం తద్వారా బ్యాంకు ఖాతాల్లోని డబ్బును లాక్కునే పద్ధతుల పట్ల రైల్వే ప్రయాణికులను అప్రమత్తం చేశారు. యూఆర్ఎల్ తనిఖీల పేరుతో వచ్చే కాల్స్‌కు ఎటువంటి వివరాలు అందజేయకూడదని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీఆర్పీ, సైబర్‌క్రైం అధికారులు పాల్గొన్నారు.

యూజీసీ పేస్కేల్‌ను అమలు చేయండి



ఉస్మానియా యూనివర్సిటీ: వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకులకు యూజీసీ పే స్కేల్‌ను అమలు చేయాలని, ఓయూ పూర్వ విద్యార్థి నేత, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రధాన సలహాదారులు వేంనరేందర్ రెడ్డికి బుధవారం వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు అధ్యాపకులకు పే స్కేల్‌ను అమలు చేయనందున విద్యార్థులు, వర్సిటీలు నష్టపోతున్నాయని వివరించారు. పే స్కేల్ అమలుకానందున యూజీసీ, ఏఐసీటీఈ, ఎన్‌సీఆర్‌టీ తదితర ఫండింగ్ ఏజెన్సీల నుంచి మేజర్, మైనర్ ప్రాజెక్టులు చేసేందుకు కాంట్రాక్టు అధ్యాపకులను అనుమతించడం లేదన్నారు. విద్యార్థుల పీహెచ్‌డీకి గైడ్‌షిప్‌కు (పర్యవేక్షణ) అర్హత ఉండాలంటే యూజీసీ పేస్కేల్ నిబంధన ఉందని నరేందర్ రెడ్డికి వివరించినట్లు తెలిపారు. దీనిపై వేం నరేందర్‌రెడ్డి సాకుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సీమర్ల విజయేందర్ రెడ్డి, ఉపేందర్, రేష్మారెడ్డి, వేల్పుల కుమార్, వెంకటేష్, రామలింగం, రమేష్, హరీష్, కిరణ్‌కుమార్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో అమరవీరులకు ఘన నివాళి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో జంపాల, చంద్రశేఖర్, ప్రసాద్ అమరవీరుల 49వ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. పీడీఎస్‌యూ (విజృంభణ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లూరి విజయ్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసిన జే.సీ.ఎస్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విజయ్ మాట్లాడుతూ జార్జిరెడ్డి అనంతరం జేసీఎస్, పీడీఎస్‌యూ బాధ్యతలు భుజస్కంధాలపై వేసుకొని సమసమాజ స్థాపనకు పోరాడినట్లు వివరించారు. వారిపోరాట స్ఫూర్తితో నేటి విద్యార్థులు విద్యారంగ సమస్యలపై పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ (విజృంభణ) రాష్ట్ర అధ్యక్షులు రియ సిడం బాపూరావు, నగర కన్వీనర్ దుర్గం దిలీప్, ఓయూ నాయకులు జస్వంత్, నవీన్, సుధాకర్, సంతోష్, మనోజ్‌లతో పాటు అరుణోదయ నాయకులు రాకేష్, అరుంధతి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

రేడియోలజికల్ ఫిజిక్స్ కోర్సులో ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఫిజిక్స్ విభాగంలో కొనసాగుతున్న పోస్ట్ ఎమ్మెస్సీ పీజీ డిప్లొమా ఇన్ రేడియోలజికల్ ఫిజిక్స్ కోర్సులో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఎమ్మెస్సీ ఫిజిక్స్, న్యూక్లియర్ ఫిజిక్స్ కోర్సులో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ కోర్సులో ప్రవేశానికి అర్హులని పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ.పాండురంగారెడ్డి తెలిపారు. డిసెంబరు 14న జరిగే ప్రవేశ పరీక్షకు ఈ నెల 11నుంచి వచ్చే నెల 15 వరకు రూ.500 అపరాధ రుసుముతో డిసెంబరు 10 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు ఉస్మానియా వెబ్‌సైట్ చూడాలని డైరెక్టర్ చెప్పారు.

ముమ్మరంగా సమగ్ర కుటుంబ సర్వే

- మొదటిరోజు ఇళ్లకు స్టిక్కర్లు అంటించిన సిబ్బంది
- సనత్‌నగర్ నియోజకవర్గంలో విధుల్లో 432 ఎన్యుమరేటర్లు
- 15వ తేదీలోగా సర్వే పూర్తి చేసేలా ప్రణాళిక
- సర్వేను పరిశీలించిన అధికారులు



సర్వేను పరిశీలిస్తున్న అదనపు కమిషనర్ చంద్రకాంత్



ఇళ్లకు స్టిక్కర్లు వేయిస్తున్న జోనల్ కమిషనర్ రవికిరణ్

సనత్‌నగర్: ప్రభుత్వం తలపెట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన అంశాలపై సర్వే ప్రక్రియ మొదలైంది. ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి ఆయా అంశాలపై ఉన్న ప్రశ్నావళిని ఆధారంగా చేసుకుని వివరాలను సేకరిస్తున్నారు. సనత్‌నగర్ నియోజకవర్గం బేగంపేట సర్కిల్ పరిధి కిందికి వచ్చే బేగంపేట, రాంగోపాల్‌పేట, బన్సీలాల్‌పేట, మోండా డివిజన్ల వ్యాప్తంగా మొత్తం 432 మంది ఎన్యుమరేటర్లు ఈ సర్వేలో పాల్గొంటున్నారు. సర్కిల్ వ్యాప్తంగా 43 వేల ఇళ్లు ఉండగా ఒక్కో ఎన్యుమరేటర్‌కు 150ఇళ్లను సర్వే చేయాలని లక్ష్యంగా పెట్టారు. ప్రాథమిక పాఠశాల టీచర్లు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ, జీహెచ్‌ఎంసీ సిబ్బందితో పాటు ఆర్పీలను ఎన్యుమరేటర్లుగా నియమించి సర్వేలో భాగస్వాములను చేశారు. అలాగే ఖైరతాబాద్ సర్కిల్ పరిధి కిందికి వచ్చే సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్లలో సైతం 220 మంది ఎన్యుమరేటర్లను నియమించారు. తమకు కేటాయించిన బ్లాక్‌లో ఉదయం నుంచే ఎన్యుమరేటర్లు సర్వే ప్రక్రియను మొదలుపెట్టారు. ముందుగా ఇంటి నెంబర్లు, ఆ తర్వాత కుటుంబ యజమాని పేరు నమోదు చేసుకుని ఆ ఇంటిని సందర్శించినట్లుగా స్టిక్కర్‌ను అంటించారు. మొదటి మూడు రోజులు స్టిక్కర్లు అంటించే ప్రక్రియ చేపట్టి పూర్తి చేయనున్నారు. కుటుంబాల వారీగా ఆస్తులు, ఆదాయం, అప్పులు, రాజకీయ పదవులు, ఐదేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధి తదితర ప్రశ్నలతో దరఖాస్తులను పూరించనున్నారు. ఎన్యుమరేటర్లు వచ్చినప్పుడు ఆ ఇంట్లో ఒకటి కంటే ఎక్కువ కుటుంబాలు ఉంటే మరో ఇంటి నెంబర్‌ను కేటాయించి సమాచారాన్ని వేర్వేరుగా సేకరించనున్నారు. ఈనెల 15లోగా సర్వే పూర్తి చేయాలని భావిస్తున్నారు. జనాభా ఆధారంగా ఒక్కో బ్లాక్‌లో రోజుకు 10 నుంచి 15 కుటుంబాలను సర్వే చేయాలని నిర్ణయించారు. ఎప్పటికప్పుడు సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఆపరేటర్లను నియమించి శిక్షణ కూడా ఇచ్చారు.

ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దు
– జీహెచ్‌ఎంసీ అధికారులు

జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్ చంద్రకాంత్ రాణిగంజ్ సమీపంలోని అంబేడ్కర్‌నగర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లల్లో జరుగుతున్న సర్వే ప్రక్రియను పరిశీలించారు. సర్వే చేస్తున్న తీరును ఆయన పర్యవేక్షించారు. అలాగే బేగంపేట పాటిగడ్డలో జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్ సర్వే ప్రక్రియను పరిశీలించారు. సందర్శించిన ఇళ్లకు స్టిక్కర్లను వేయించారు. అదేవిధంగా బేగంపేట సర్కిల్ ఉప కమిషనర్ సమ్మయ్య ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్నారు. బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి ఇంటికి వెళ్లి వారి కుటుంబ వివరాలను సేకరించారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా జాగ్రత్తగా సర్వే నిర్వహించాలని ఈ సందర్భంగా సిబ్బందికి అధికారులు సూచించారు. దరఖాస్తు ఫారంలో సూచించిన విధంగా సమాచారాన్ని సేకరించాలన్నారు.



బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరిశ్రీహరి ఇంటి వివరాలను సేకరిస్తున్న ఉప కమిషనర్ సమ్మయ్య

'గృహజ్యోతి'లో జరిగే గందరగోళాన్ని సరిచేస్తాం

సికింద్రాబాద్ డివిజనల్ ఇంజినీర్ బ్రహ్మానందం

సాక్షి ఎఫెక్ట్..

బన్సీలాల్‌పేట్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి అమలు చేస్తున్న గృహజ్యోతి (ఉచిత కరెంట్ సరఫరా)లో జరుగుతున్న గందరగోళంపై అధికారులు దృష్టిసారించారు. ఈనెల 6వ తేదీన 'సాక్షి'లో 'గృహజ్యోతి అమలులో గందరగోళం' అనే కథనానికి విద్యుత్తు అధికారులు స్పందించారు. గృహజ్యోతి పథకం కింద పేదలు 200 యూనిట్ల వరకు విద్యుత్తును వినియోగించుకుంటే విద్యుత్తు బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేదు. అయితే ఈ పథకం ఆచరణలో అనేక సమస్యలకు కారణమవుతుంది. ముఖ్యంగా ఇంటి ఓనర్స్, రెంట్‌కు ఉండే వారి మధ్య తీవ్ర గజిబిజి గందరగోళాన్ని సృష్టిస్తుంది. ఇంటి యజమానికి తెలియకుండా అద్దెదారుడు గృహజ్యోతి పథకం కింద దరఖాస్తు చేసుకొని లబ్ధిపొందుతున్నారు. వాస్తవానికి లబ్ధిదారుడు ఎక్కడ నివాసం ఉంటే సదరు ఇంటిపై గృహజ్యోతి పథకం కింద ప్రయోజనం పొందడానికి వీలుంది. అయితే ఆచరణలో అనేకమంది ఇంటి రేషన్ కార్డు, ఇల్లు ఓ చోట ఉంటే మరో చోట లబ్ధిపొందుతున్నారు. వాస్తవానికి ఎక్కడ ఇల్లు, రేషన్ కార్డు ఉంటే అక్కడే గృహజ్యోతి పథకాన్ని పొందాలి. క్షేత్రస్థాయిలో ఇలా జరగడం లేదు. ఇటు విద్యుత్తు, జీహెచ్‌ఎంసీ అధికారుల మధ్య సమన్వయలోపం కారణంగా అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

గృహజ్యోతి సమస్యలను పరిష్కరిస్తాం
– డీఈ బ్రహ్మానందం

గృహజ్యోతి పథకంపై సమస్యలు ఉత్పన్నం కాకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని విద్యుత్తు శాఖ సికింద్రాబాద్ డివిజనల్ ఇంజినీర్ బ్రహ్మానందం చెప్పారు. ప్రభుత్వం గృహజ్యోతి పథకం ద్వారా పేదలకు ఉచితంగా విద్యుత్తు సరఫరా చేస్తుందన్నారు. ప్రతి నెలా 200 యూనిట్లలోపు విద్యుత్తు వాడే ప్రతి పేదవాడు ఈ పథకానికి అర్హులన్నారు. అయితే అనర్హులు ఈ పథకం ద్వారా లబ్ధిపొందడం సరైన పద్ధతి కాదన్నారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉండి, తెల్లరేషన్‌కార్డు కలిగి ఉండి, 200 లోపు యూనిట్ల విద్యుత్తు వినియోగించుకునే వారు ఈ పథకానికి అర్హులన్నారు. ఇంటి యజమాని అడ్రస్, పేరిట అద్దెదారుడు కరెంట్ ఉచితంగా పొందడం సరైన పద్ధతి కాదని సూచించారు. ఈ విషయమై తాము క్షేత్రస్థాయిలో పర్యటించి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సనత్‌నగర్: బేగంపేట సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని గ్రీన్ ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గవర్నమెంట్ హాస్పిటల్ మెయిన్‌రోడ్డు, హోండా షోరూం, అమోఘ జూనియర్ కాలేజీ, అభిరుచి లేన్, బల్కంపేట మెయిన్‌రోడ్డు, సోనీ వైన్స్ వెనుక ప్రాంతం, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శాంతిబాగ్, శివబాగ్, కేకే జోన్ హోటల్ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

కార్పొరేటర్ సామలహేమకు ఘన సన్మానం



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని ఆంధ్ర మహిళా సభ కాలేజీలో సీతాఫల్‌మండి కార్పొరేటర్ డాక్టర్. సామలహేమను ఘనంగా సన్మానించారు. బుధవారం తెలంగాణ మహిళా విద్యావంతుల ఫోరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సామాజికవేత్త, విశ్రాంత అధ్యాపకులు ప్రొ. రమా మెల్కోటే, తెలంగాణ మహిళా విద్యావంతుల ఫోరం గౌరవ అధ్యక్షురాలు, ఓయూ విశ్రాంత ప్రొఫెసర్. కస్తూరి లక్ష్మీ తదితరులు కార్పొరేటర్ డాక్టర్ హేమను ఘనంగా సన్మానించారు. చిన్న వయస్సులోని రాజకీయాల్లోకి ప్రవేశించి రెండుసార్లు సీతాఫల్‌మండి కార్పొరేటర్‌గా గెలిచి ప్రజలకు సేవ చేస్తునందుకు ఆమెను అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మహిళా విద్యావంతల అధ్యక్షురాలు, హైకోర్టు లాయర్ స్వర్ణలత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తల్లమల్ల శ్వేత హసేన్, కార్యదర్శి డాక్టర్. రేష్మా, కోశాధికారి నిజాం కాలేజీ అధ్యాపకురాలు డాక్టర్ ద్వాత్రిక స్వప్న, ఉపాధ్యక్షులు రోజా తదితరులు పాల్గొన్నారు.

బ్యాగ్ చూస్తుండమని చెప్పి..

ప్రయాణికుడి చేతిలో నగదు లాక్కుని వెళ్లిన ఆగంతకుడు

అమీర్‌పేట: స్వగ్రామానికి వెళ్లేందుకు బస్సు కోసం వేచి చూస్తున్న ప్రయాణికుడితో పరిచయం చేసుకున్న గుర్తుతెలియని వ్యక్తి క్షణాల్లో అతడి చేతిలోని నగదు లాక్కుని పరారైన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. జరిగిన సంఘటన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మాదాపూర్‌లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న వెంకటేష్ తన సొంత ఊరు కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం, పులిటూరుకు వెళ్లేందుకు ఈనెల 4వ తేదీన బస్సులో టికెట్ బుక్ చేసుకున్నాడు. ఈ క్రమంలో రాత్రి 10.30 గంటలకు బస్సు బయలుదేరే సమయానికి ముందు మెట్రో రైల్‌లో మాదాపూర్ నుంచి అమీర్‌పేటకు వచ్చాడు. పంజాబ్ ఏటీఎం నుంచి రూ.38 వేలు డ్రా చేసి జేబులో పెట్టుకుని ఎస్ఆర్‌నగర్‌లోని పిల్లర్ నెం.1059 దగ్గర బస్సు కోసం వేచి ఉన్నాడు. ఈ క్రమంలో ఓ వ్యక్తి వచ్చి వెంకటేష్‌తో పరిచయం చేసుకున్నాడు. తాను టాయిలెట్స్‌కు వెళ్లి వస్తాను, అప్పటి వరకు తన బ్యాగును చూస్తుండాలని వెంకటేష్‌కు చెప్పాడు. అయితే ఇంతలో బస్సు వస్తే ఇబ్బంది అవుతుందని సదరు వ్యక్తి ఫోన్ నెంబరు కూడా తీసుకున్నాడు. ఆ తర్వాత తన వద్ద జేబులో ఉన్న డబ్బును తీసి మడతలను సరిచేసి పెట్టుకుంటుండగా అక్కడికి వచ్చిన ఆగంతకుడు చేతిలోని డబ్బును లాక్కుని పారిపోయాడు. వెంకటేష్ అతడిని పట్టుకునేందుకు ప్రయత్నించినా దొరకలేదు. అయితే ఆగంతకుడు వదిలివెళ్లిన బ్యాగులో బట్టలు తప్ప ఏమీలేవు. అతడిచ్చిన ఫోన్ నెంబరు సైతం కలువకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

సర్వేలో నా వివరాలు వెల్లడించను

సర్వే ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు ప్రభుత్వంలోకి వచ్చాక అమలు చేయడం లేదని సికింద్రాబాద్ ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్ ఆరోపించారు. ఇందుకు నిరసనగా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో తన కుటుంబ వివరాలు అందించడానికి సిద్ధంగా లేనని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే సికింద్రాబాద్ సీతాఫల్ మండి డివిజన్ టీఆర్‌టీ కాలనీలో కార్పొరేటర్లు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు ఇండ్ల వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. అనంతరం పద్మారావు మాట్లాడుతూ సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఎక్కువ మంది పేద, మధ్య తరగతి ప్రజలు ఉన్నారని చెప్పారు. ఈ సర్వేతో తమకు ఏదైనా లబ్ధి చేకురుతుందన్న ఆశలు ప్రజల్లో



కుటుంబ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

ఉన్నాయని చెప్పారు. అదే సమయంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై ప్రజలల్లో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. లోగడ బీఆర్ఎస్ ప్రభుత్వం చేయించిన కుటుంబ సర్వే వివరాలు ప్రభుత్వం దగ్గర ఉన్నాయని పద్మారావుగౌడ్ చెప్పారు. వాటిని వినియోగించుకోకుండా మళ్లీ సర్వే నిర్వహించడం ఆరు గ్యారంటీల అమలును వాయిదా వేయడానికేనన్న అనుమానాలు ప్రజల్లోలే వ్యక్తమవుతున్నాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రజల నుంచి వచ్చిన అనుమానాలు, వినతులను అధికారుల దృష్టికి తీసుకువెళ్ళడం జరిగిందని, వాటిని అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని తద్వారా ప్రజలకు న్యాయం చేసేందుకు కృషి చేయాలని పద్మారావు కోరారు.

సర్వే ద్వారా ప్రజలకు ఏం మేలు జరుగుతుందో తెలపాలి

కుటుంబ సర్వేపై సీతాఫలమండిలోని తన క్యాంపు కార్యాలయంలో సర్వే నిర్వహణ తీరుతెన్నులపై ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ సమీక్ష నిర్వహించారు. జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ డి.సుభాష్ రావు నేతృత్వంలోని పలువురు అధికారులు, కార్పొరేటర్లు, పలువురు నాయకులు సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ సర్వే ద్వారా ప్రజలకు ఏం మేలు జరుగుతుందో చెప్పాలని అన్నారు. అదేవిధంగా పలువురు నాయకులు పలు ప్రశ్నలను లేవనెత్తారు.

సర్వేలో అందరూ భాగస్వాములు కావాలి

ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై, అధికారులకు తమ వివరాలు అందజేయాలని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. కంటోన్మెంట్ ఆరో వార్డు సీతారాంపూర్‌లో అధికారులు చేపట్టిన సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ సర్వే ద్వారా ప్రజలకు సంబంధించిన సామాజిక, ఆర్థిక అంశాలతో పాటు సమగ్ర సమాచారం సేకరించడం జరుగుతుందన్నారు. ఈ సమాచారం ఆధారంగానే భవిష్యత్‌లో ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలకు ఓ అంచనా ఏర్పడుతుందన్నారు. కుటుంబ వివరాలన్నీ ఒకే క్లిక్‌తో ప్రభుత్వానికి తెలిసే వెసులుబాటు కలుగుతుందన్నారు. తద్వారా వివిధ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక సులభతరం అవుతుందన్నారు. కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రలోనే కులగణనపై స్పష్టమైన ప్రకటన



కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీగణేశ్

చేశారని, సామాజిక న్యాయం కోసం ఆయన కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలతో పాటు కుల గణన పైన సందేహాలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ నాయకులు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు జాయింట్ సీఈఓ పల్లవి, ఆర్‌డీఓ సాయిరామ్, కంటోన్మెంట్ హెల్త్ సూపరింటెండెంట్ దేవేందర్, తహసీల్దార్ అశోక్‌కుమార్, కాంగ్రెస్ నేతలు అజయ్ కుమార్, శ్రీకాంత్, శరత్, గౌతమ్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేతో మరింత సమర్థవంతమైన పాలన

కార్యక్రమాన్ని ప్రారంభించిన డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత

లాలాపేట: సమగ్ర కుటుంబ సర్వేతో మరింత సమర్థవంతమైన పాలన లభిస్తుందని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి అన్నారు. బుధవారం తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలో కార్యక్రమాన్ని మోతే శ్రీలతశోభన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సిబ్బంది పూర్తి వివరాలు నమోదు చేసి ఆమె నివాసానికి సర్వే పూర్తైనట్లుగా స్టిక్కర్‌ను అంటించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ సర్వే ద్వారా సేకరించిన వివరాలతో ప్రభుత్వం పరిపాలనలో మరింత సమర్థవంతంగా ప్రజలకు ఉపయోగపడే నిర్ణయాలు తీసుకునేందుకు దోహదపడుతాయన్నారు. దీంతో పాటుగా సంక్షేమ పథకాల



డిప్యూటీ మేయర్ నివాసానికి స్టిక్కర్‌ను అతికిస్తున్న సిబ్బంది

అమలులో మరింత సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. మెరుగైన పాలన అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజలతో పాటు రాజకీయ నాయకులు ఈ సర్వేకు సహకరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు అలవాటైతే జీవితాలు నాశనం

కళాశాల రిటైర్డ్ అధ్యాపకులు డాక్టర్ పి.మోహన్‌రావు



మాట్లాడుతున్న డా. పి. మోహన్‌రావు

లాలాపేట: సరదాగా ప్రారంభమైన మాదక ద్రవ్యాల వినియోగం నేడు విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తుందని, అందుకే వాటికి దూరంగా ఉండాలనీ రైల్వే డిగ్రీ కళాశాల రిటైర్డ్ అధ్యాపకులు డాక్టర్ పీ. మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఎస్వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోహన్‌రావు ముఖ్యతిథిగా పాల్గొని మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను విక్రయిస్తున్న, సరఫరా చేస్తున్న వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలనీ అభిప్రాయపడ్డారు. నగరంలోని పబ్బుల్లో జరుగుతున్న చట్ట వ్యతిరేఖ కార్యక్రమాలను ప్రభుత్వం నియంత్రించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు మాదక ద్రవ్యాల భారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పిల్లల దినచర్యను గమనించాలనీ సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగంతో యువత దొంగలుగా, సంఘ విద్రోహ శక్తులుగా మారుతున్నారని పేర్కొన్నారు. వాటిని కట్టడి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ కాలేద్ షా, శ్రీలత, సయ్యద్ ఫరీదుద్దీన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు,

చలో ఢిల్లీని జయప్రదం చేయాలి

ఏఐఆర్‌ఆర్‌ఎఫ్ అధ్యక్షుడు శ్రీధర్



అడ్డగుట్ట: నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ (ఎన్‌సీసీపీఏ) పిలుపు మేరకు నవంబర్ 13న నిర్వహించ తలపెట్టిన చలో ఢిల్లీ నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వేమెన్ ఫెడరేషన్(ఏఐఆర్‌ఆర్‌ఎఫ్) జాతీయ అధ్యక్షుడు సాగరం శ్రీధర్ ఒక ప్రకటనలో కోరారు. 8వ పే కమిషన్ ఏర్పాటు చేయాలని, 18 నెలల డీఏ ఏరియర్స్ చెల్లించాలని, పెన్షన్ కమ్యుటేషన్ 12 సంవత్సరాలకు కుదించాలన్నారు. అదే విధంగా అదనపు పెన్షన్ 65 ఏండ్ల నుంచి ఇవ్వాలని, ఓల్డ్ పెన్షన్ సిస్టం అందరికీ వర్తింపచేయాలని కోరారు. దీంతోపాటు పెండింగ్‌లోని మరిన్ని సమస్యలపై వెంటనే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగులు తీవ్రమైన సమస్యలతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తమ న్యాయపరమైన డిమాండ్ల సాధన కోసం రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో 'అన్నకూట్'

పెద్ద ఎత్తున హాజరైన భక్తులు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ జనరల్ బజార్‌లోని లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో బుధవారం ఘనంగా అన్నకూట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి సంవత్సరం కార్తీక మాసం శుద్ధ పంచమి రోజు దేవాలయంలో అన్నకూట్ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా వంటశాలలో వండిన పులిహోర, లడ్డూ, బూందీ, క్షీరాన్నం, కదంబం తదితర నైవేద్యాలను స్వామివారి ముందు ఉంచిన తర్వాత వాటిని భక్తులకు వితరణ చేశారు. ఈ పూజా కార్యక్రమంలో సికింద్రాబాద్ నుంచే కాకుండా నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ అనువంశిక ధర్మకర్తలు గుమిడెల్లి శ్రీనివాస్, గుమిడెల్లి రవీందర్‌లు మాట్లాడుతూ ద్వాపర యుగంలో శ్రీకృష్ణ పరమాత్ముడు గోవర్ధన్ గ్రామంలో దేవేంద్రుని ఆగ్రహం నుంచి గ్రామవాసులను కాపాడేందుకు చిటికెన వేలుతో గోవర్ధన పర్వతాన్ని ఎత్తి ఏడురోజుల పాటు వారిని



కాపాడతారని చెప్పారు. దీనికి కృతజ్ఞతగా గ్రామస్తులు తమ తాహతు మేరకు రకరకాల ఆహారాన్ని వంట చేసి పెట్టారని దానికి గుర్తుగా కార్తీక మాసంలో అన్నకూట్ నిర్వహిస్తామని చెప్పారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో కొమ్మాలు, అనువంశిక ధర్మకర్తలు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

మహిళ అదృశ్యం



నాగరాణి (ఫైల్)

అడ్డగుట్ట: ఇంటి నుంచి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ కిషోర్ తెలిపిన వివరాల ప్రకారం... లాలాపేటలోని ఆర్యనగర్ ప్రాంతానికి చెందిన నల్ల నాగరాణి (37) కిమ్స్ హాస్పిటల్‌లో రిసెప్షనిస్ట్‌గా పని చేస్తుంది. ఈనెల 4వ తేదీ సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన నాగరాణి మళ్లీ తిరిగి ఇంటికి రాలేదు. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో ఆమె భర్త నల్ల కిరణ్ పరిసర ప్రాంతాల్లో వెతికి, తెలిసిన వారిని వాకబు చేసినా ఫలితం కనిపించలేదు. దీంతో బుధవారం స్థానిక లాలాగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.